# 5. దొంగలు

"గుళ్లో దొంగలు పడ్డారు" పొద్దున్నే నిద్ర లేచీ లేవగానే కళ్యాణి నా చెవిని వేసిన వార్త యిది.

"ఏ గుడి?" మెల్లగా అడిగాను నేను.

"అదేనండీ, చిదంబరం గుడి"

చిదంబరం గుడి — ఈ గుళ్లో దేవుడి పేరు చిదంబరం కాదు. ధర్మకర్త పేరూ చిదంబరం గాదు. అయినా ఒక విధంగా అది గుడే కాదేమో! ఒక వేపచెట్టు, వేపచెట్టుకింద ఒక పక్కగ ఒక చిన్న పాక, మరో పక్క ఒక చిన్న రాతికట్టడం, ఆ రాతికట్టడంలో సీతారాముల విగ్రహాలు కావేమో కానీ, సీతా రాముల బొమ్మలు, వారికి అంజలి ఘటిస్తున్న ఆంజనేయ స్వామి బొమ్మ, ఈ మూడింటికి వంతెన లాగ లక్ష్మణస్వామి బొమ్మ—ఇది గుడి. గోపురం లేని గుడి, మకుటం లేని దేవుడు.

—ఆఖరికి గుడైనా లేని దేవుడు.

ఆ రాతి కట్టడంలో ఎలా కాపురం చేస్తున్నాడో ఏమో!

అచ్చం అలాగే—

ఆ రాతి కట్టడం పక్కనే ఉన్న ఆ మట్టి పాకలో వున్న వ్యక్తి కూడా ఎలా కాపురం చేస్తున్నాడో, ఈ సంసార సాగరాన్ని ఎలా ఈదుతున్నాడో తెలీదెవరికీ!

ఆ గుళ్ళో దేవుడు శ్రీరామచంద్రుడు.

ఆ పాకలో మానవుడు చిదంబరం!

అందుకే ఆ గుడికి రామాలయం అనే పేరు రావటం కన్నా, 'చిదంబరం గుడి' అనే పేరు వచ్చింది.

ఆ గుళ్ళో దొంగలు పడ్డారు.

గుడి చాలా పవిత్రమైన స్థలం. గుళ్ళో "దొంగ"తనంలాంటి పని చేయడానికి మొదట ఎంతో ఆత్మబలం కావాలి. మనకు–అంటే హైంద వులకు దైవభీతి ఎక్కువ. వాళ్ళు చాలా భయ పడతారు. ఈ లోకంలో పనులకు మరో లోకంలో శిక్ష అనుభవించవలసి వుంటుందని వాళ్ళు నమ్ముతారు.

బహుశా ఈ పని హైందవేతరుడు చేసివుంటాడు – ఈ దేశంలో ఏదో వినాశానికే దారి తీస్తున్నట్లున్నది. 'ఈ మత కలహాలు' ఈ అల్లర్లు ........ఏమిటో, ఒక్కొక్కసారి ఈ దేశాన్ని చూసి భోరున ఏడవా లనిపిస్తుంది.

మనసంతా వికలమయిపోయింది.

అయినా –

గుళ్ళో ఏముందని దోచుకుంటారు ?

దొంగలు బహుశా చిదంబరం యింట్లో పడివుంటారు. అసలే బీదవాడు ఈ దోపిడీ అతన్ని మరింత దిగజార్చ వచ్చు.

కళ్యాణిని పిలిచి సందేహ నివృత్తి చేసుకోవడం మంచిదనిపిం చింది నాకు.

"చూడు కళ్యాణీ, దొంగలు పడ్డది గుళ్ళోనా ? చిదంబరం ఇంట్లోనా ?"

ఒకసారి నాకేసి అదోలా చూసింది కళ్యాణి.

"ఇది మరీ చోద్యమండీ ! గుళ్ళో దొంగలు పడ్డారని నే చెబు తూనే వున్నానా ? మళ్ళీ అదే ప్రశ్న అడిగితే, ఏమనుకో వాలి నేను ?"

"ఛ. అన్నిటికీ అలా అంటే యెలా? దొంగలు పడ్డది గుళ్ళో నేనా అని నేనడిగింది."

"అవును అనే నేనన్నది" – అంది కళ్యాణి.

నాకు బాధ ఆధికమయింది.

మనిషిని మనిషి దోచుకోవడం చాలా కాలంగా వుంది. ఎదుటి మనిషిని ఎంత ఎక్కువగా దోచుకోగలిగితే అంత గొప్పవాడు ఈ దోపిడీ దారు. కానీ, యిలా దేవుళ్ళను దోచుకోవడం నాకు తెలీని సంగతి. నేను ఊహించని సంగతి.

"అయినా కళ్యాణీ, గుళ్లో దోచుకోవడానికి ఏముంది?"

"లేకపోవటమేం?—మొన్న నేగా చిదంబరం గుళ్లో కి వచ్చిన వాళ్ళందరి దగ్గర కొంత డబ్బులు పోగుచేసి, సీతమ్మ వారికి గొలుసు చేయించింది–"

అవును నిజమే! – గుళ్ళోకి వెళ్ళిన వాళ్లందరు వేసిన డబ్బు లన్నీ–ఎన్నాళ్ళనుంచి దాచాడో ఏమో – పోగుచేసి, అమ్మవారికి గొలుసు చేయించాడు చిదంబరం. ఆ గొలుసుమీద పడివుంటుంది ఎవరిదో కన్ను– 'హూష్ కాకీ' అయిపోయింది గొలుసు.

స్నానం చేశాక గుడివేపు వెడదామని బయలుదేరాను–గుడి దగ్గర దగ్గరగ వెళ్తోంటేనే చిదంబరం ఎదురొచ్చాడు.

"నమస్కారం" అన్నాడు చిదంబరం నన్ను చూసి.

"నమస్కారం చిదంబరం! గుళ్ళో .... ఏమనాలో తెలీక మాటలు నాన్చాను నేను.

"అవునండీ – దొంగలు పడ్డారు. అమ్మవారి గొలుసు దొంగిలిం చారు.........అన్నాడు చిదంబరం. ఆ కంఠంలో బాధ. ఆ కంఠంలో వ్యథ నాకు ఈ జీవితాంతంవరకు గుర్తుంటుంది.

"ఇంకా ఏమన్నా....... అంటే మీ ఇంట్లోకూడా..."

"లేదండీ మా యింట్లో జరిగినా ఇంత బాధపడేవాడినేకాదు నేను- దేవుడు ఎందుకో ఆగ్రహించాడు నామీద. అంతే? లేకపోతే ఈ దారుణం జరగడ మేమిటి?"

ఈతన్ని చూస్తోంటేనాకు ఎందుకో రామదాసు గుర్తొచ్చాడు. దైవ భక్తితో దేవుణ్ణి కొలిచి, ఎన్నో ఆభరణాలతో అందమైన గుడికట్టించినా, రామదాసుకు దైవానుగ్రహం లేకపోయింది.

అంతే! మంచికీ, మంచివాళ్ళకూ దేవుడు ఉండడు.

"పోనీ చిదంబరం, పోలీసు రిపోర్టు వగైరా...."

"ఎందుకండీ, వాళ్ళతో చిక్కులు! వాళ్ళవల్ల పని జరిగేదికాదు. క్షణం ఆగి అన్నాడు తనే-"అయినా సబిన్స్పెక్టరుతో చెప్పాననుకోండి. రాతకోతలు లేకుండా చూడమని - సరే నన్నారు"

చిదంబరం ముందుకు కదిలాడు.

నేను వెనక్కు తిరిగి ఇంటికి వచ్చేశాను.

మధ్యాహ్నం నిద్రలేవగనే కళ్యాణి నా దగ్గరగా చేరింది.

"ఏమిటి సంగతి-" అన్నాను నేను.

"మీకో శుభవార్త చెబుతాను, ఏమిస్తారు?" అంది కళ్యాణి గోముగా.

కళ్యాణి పెట్టిన పోజు నాకెంతో నచ్చింది. ఎంతో ముద్దొచ్చింది. "నీది కానిదేమున్నది లలనామణీ నాలో! ఏం కావాలన్నా, ఏంచేయా లన్నా...."

"సరే, మీరింకా నిద్ర లేవనట్లుంది గానీ...."

"ఛ, తప్పు. నిద్ర లేచానుగానీ శయ్యపై నుండి మాత్రం లేవ లేదు, అందుకే...."

"చాల్లేండీ.... ఇంతకీ ఆ సంగతేమిటో తెలుసా? సీతమ్మవారి గొలుసు దొరికింది"

"ఎక్కడ!" ఆశ్చర్యంతో. ఆనందంతో అడిగాను నేను.

"దొంగ దగ్గర"

"దొంగెక్కడ దొరికాడు?-"

"ఏమో-దొంగ దొరికాడు, దొంగ దగ్గర గొలుసు దొరికింది. అది ఈ నాటి శుభవార్త" అంది కళ్యాణి.

శుభవార్తే మరి! అమ్మవారి మెడలోకి గొలుసు - అందులోనూ దొంగెత్తుకుపోయింది మళ్ళీ దొరకడం అదృష్టం గదూ - అందులోనూ దొంగ కూడా దొరికాట్ట!

దొంగ దొరికాడంటే ఒక విధంగ సంతోషంగా ఉంది. ఒక విధంగా విచారంగా ఉంది. ఈ దొంగను వీళ్ళు అంత తేలికగా వదులు తారా?

కొట్టడంలాంటి అమానుషమైన పనులు చేయకుండా వదిలే మాన వులా వీరు?

అయినా ఎంతటి అవసరం వస్తే, ఈ దొంగతనానికి పూను కొన్నాడో!

- భక్తులకు ఇవన్నీ అనవసరం. దొంగ దొరికాడు. గొలుసు దొరికింది. ఇక దొంగకు శిక్షే దొరకాలి - ఒకసారి మనసు కుంచించుకు పోయింది.

మొహం కడుక్కొని గుడికి బయలు దేరాను. గుడి వేపచెట్టు క్రింద అందరూ కూర్చొని వున్నారు. దగ్గరగా వెళ్ళాక వాళ్ళను గుర్తు పట్టగలిగాను. - రఘురామయ్య, రాఘవేంద్రరావు, తిరుపతయ్య, ఆంజ నేయులు. ఇంకా ఎందరో మహానుభావులు....

ఇక్కడ ఇందరుచేరి ఏమి చేస్తున్నారు?

– అందరిమధ్య తలవంచుకుని దోషి నిలబడి ఉన్నాడు.

తిరుపతయ్యగారే ఏదో మాట్లాడుతున్నారు. నేను వెళ్ళేసరికి –

"అసలింతటికీ కారణం గుడి సరిగా లేకపోవడమే–గట్టిగా ఒకతన్ను తంతే మొత్తం అంతా పడిపోతుంది. మరి – దొంగ వచ్చేడంటే రాడూ మరి !"

"అందుకే నేను అంటున్నది, ఇన్నాళ్ళూ మనము అశ్రద్ధచేశాము. ఇపుడయినా ఆలస్యం కాలేదు. రామాలయం కొత్తగా కడితేసరి– దైవాను గ్రహంవల్ల మనం బాగా ఉండొచ్చు. ఇంకమీదట ఇలా దొంగతనాలకూ ఆస్కారం ఉండదు." ఆంజనేయులు అంటున్నది సబబుగా కనిపించింది నాకు. దొంగలుపడే సంగతి దేవుడెరుగుకానీ, గుడి అంటూ ఒకటి ఏర్పడుతుంది. అంతకన్నా కోరుకోదగ్గది ఏముంది ?

"పదిమంది పెద్దలూ కలిసి, అవుననుకుంటే చాలు. మా బావ గారి తోడల్లుడు మినిష్టర్‌గదా. కొంత గవర్నమెంట్ నుంచికూడా గ్రాంట్ సంపాదించుకోవచ్చు...." రాఘవేంద్రరావు అన్నది ఉత్సాహ కరంగ ఉంది. గుడిఅయితే త్వరలోనే వెలిసే సూచనలున్నాయి.

"మీకన్నా పెద్దలెవరున్నారులెండి, అందరం ఇక్కడే ఉన్నాము. ఏదో ఒకటి నిర్ణయించుకొని వెళ్ళడం మంచిది "

ఒక్కొక్కసారి కీడుకూడ మంచే చేస్తుందన్నదానికి తార్కాణం నా కిపుడు కనిపిస్తూనే ఉంది. దొంగతనంవల్ల గుడి బాగుపడుతోంది.

దేవుడు అదృష్టవంతుడు ! !

ఎక్కువసేపు పెద్దలముందు ఉండి వాళ్ళ చర్చలు వినడం మంచిది గాదనిపించి, ఇంటికి వచ్చేశాను.

రెండు రోజుల తర్వాత చిదంబరం కనిపించాడు. నవ్వుతూ పలక రించాను.

"చిదంబరం, ఏమి నిర్ణయించారు. మొన్న ?"

"ఏదండీ - గుడి సంగతా! కొత్తగా గుడి కట్టాలనే నిర్ణయించారు. అందరిదగ్గర చందాలు వసూలు చేస్తారుట. గవర్నమెంట్ ఇచ్చే కొంత డబ్బు కలిపి, బ్రహ్మాండమైన గుడికట్టాలని నిర్ణయించారు"

"చాలా సంతోషం. కానీ ఎప్పటికి కట్టడం?"

"త్వరగానే జరిగిపోవచ్చండీ. ఆంజనేయులుగారిని ధర్మకర్తగ ఎన్నుకొన్నారు. ఇంక పునాదులు తవ్వడమే లేటనుకోండి...."

చిదంబరం ముఖంలో ఆనందం తొణికిసలాడుతోంది. నిజమే! అది అతను వెలిగించినదీపం. ఆదీపం దేదీప్యమానంగ ప్రకాశిస్తోంటే ఆనందించే వాళ్ళెవరూ ఉండరనుకుంటాను. నాకూ ఎంతో సంబరమయింది.

ఇంటికి వచ్చి కళ్యాణికి ఈ సంగతి చెబితేగానీ నా మనస్సులోని సంతోషం తగ్గిందికాదు. కళ్యాణి సైతం ఎంతో ఆనందంగాఅంది. "మనమూ కొంత ఇద్దాం"

"సరే" అన్నాను నేను.

దాదాపుగ సంవత్సరం గడిచింది.

ఈ సంవత్సరమూ నాకు కళ్యాణి గుడిపనిలోని ప్రోగ్రెస్ ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే ఉంది. 'ఈ వేళ శంకుస్థాపన చేస్తారుట! ఈ వేళ గోడలు కట్టడం ప్రారంభిస్తారుట' 'ఈ వేళ నుంచీ గోపురం కట్టడం మొదలు' అంటూ.

అలాగే, ఆ రోజు కళ్యాణి చెప్పింది నాకు "రేపు సోమవారం నాడు విగ్రహ ప్రతిష్టాపన" అంటూ.

ఆరోజు అంత త్వరగా రావటం, వీళ్ళు ఇంతశ్రద్ధ తీసుకుని పని చేయడం చూస్తే నాకు ఎంతో ముచ్చటవేసింది. సోమవారం ప్రొద్దున్నే లేచి నేనూ, కళ్యాణీ తలంటు పోసుకున్నాం. తన కెంతో ఇష్టమైన నీలిరంగు పట్టుచీర కట్టుకుంది కల్యాణి. ఇద్దరం గుడికి బయలుదేరాము.

రాఘవేంద్రరావుగారి బావగారి తోడల్లుడుగారూ, మినిష్టరుగారూ అయిన ఆనందంగారు ఆగుడిని భక్తులకు అంకితం చేశారు.

భక్తులకు అంకితమైన గుడిని ఒక్కసారి పరిశీలనగ చూశాను - బాగానే కట్టారనిపించింది. ఇంత తక్కువ కాలంలో ఇంతపని చేయ గలగటం గొప్ప విషయమే మరి! అయినా గుడిలో ఏదో ప్రశాంతత లోపిస్తున్నట్లుంది. ఆ రాతి కట్టడం. వేపచెట్టు, చెట్టు నీడపట్టున మనసెంతో నిర్మలంగా ప్రశాంతంగా ఉండేది. కానీ ఇప్పుడది అంతా తారుమారుగా ఉంది. ఏదో వెలితి కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. అదే కళ్యాణితో అన్నాను.

నవ్వేసింది "మీ కన్నీ ఇలాటివే కనిపిస్తాయేం? ఎంత నిండుగా ఉంది ఇపుడీ గుడి? ఇంతమంది ఆడవాళ్ళనుగానీ, ఇంతమందిమగవాళ్ళను గానీ ఎప్పుడన్నా ఇక్కడ చూశాలా?"

అదీ నిజమే దేవుడిదగ్గర ఎప్పుడూ ఇంతమంది లేరు. దేవుడికి కూడా కాలం ఖర్మం కలిసివచ్చినట్లుంది.

కళ్యాణి అక్కడే ఉంటానంటే నేను ఇంటికి వచ్చేశాను.

కళ్యాణి ఇంటికి తిరిగివచ్చింది బోలెడు వార్తలతో. "మీకీ సంగతి తెలుసా?" అంది.

"తెలీదే"

"చాలు సరసం. ఆంజనేయులు గారు బోలెడు డబ్బు తినేశారుట, తెలుసా?"

ఆశ్చర్యపోయాను నేను

"నేను నమ్మను" అన్నాను నేను.

"నేనూ నమ్మలేదు కానీ, ఆయనిల్లు ఇంతకు ముసుపు పెంకుటిల్లేనా?"

"అవును"

"అయితే, ఆ పెంకుటింటిని మేడగా మార్చారుట, అదీ సంగతి"

సాయంత్రం ఇద్దరం కళ్యాణీ నేనూ కలిసి ఆంజనేయులుగారింటి వేపుగ వెళ్ళాం. నిజమే కళ్యాణి చెప్పింది నిజం అవునో కాదోగానీ ఆంజనేయులు గారి కొత్తమేడ, దాదాపు తయారయింది.

"ఏమండీ, ఒకసారి గుడిని చూడండి" అంది కళ్యాణి.

చూశాను ఈ ఆంజనేయులుగారి మేడముందు ఆ చిదంబరంగుడి,ఛ కాదు, ఆ రామాలయం వెల వెల పోతోంది.

నా మనసు మసిబారిపోయింది. చూడలేక కళ్ళు మూసుకొన్నాను. కళ్యాణి నా చేయిని పట్టుకుంది. అడుగు ముందుకు వేశాను భారంగా బాధగా ..

[స్వాతి, మాసపత్రిక-అక్టోబర్-70

చోర్ (హిందీ) ఆంధ్రప్రదేశ్-సెప్టెంబర్ 71]